# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 06-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో భాగంగా ఈరోజు ఇండోనేషియా చేరుకున్నారు.

- ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి అమిత్ షా తెలిపారు.

- సమీకృత రవాణా వ్యవస్థను నిర్మించడంలో పరివర్తనాత్మక కార్యక్రమాలు కీలకమని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు.

- జగన్నాథ రథయాత్ర నేపథ్యంలో 300కు పైగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు దేశాల ఇండో-పసిఫిక్ పర్యటనలో భాగంగా ఈరోజు ఇండోనేషియాకు చేరుకున్నారు. జకార్తా విమానాశ్రయంలో నరేంద్ర మోదీకి ఆ దేశ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ఇండోనేషియా ప్రజలు, ప్రవాస భారతీయులు సాంప్రదాయ భారతీయ, ఇండోనేషియా సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రధానమంత్రికి సాదర స్వాగతం పలికారు. 2018లో భారత్-ఇండోనేషియా సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరిన తరువాత భారత ప్రధానమంత్రి ఇండోనేషియాలో పర్యటించడం ఇది నాలుగోసారి. అలాగే.. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇండోనేషియాలో తొలి ద్వైపాక్షిక పర్యటన. ఈ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి ఇండోనేషియా అధ్యక్షుడితో ద్వైపాక్షిక చర్చలు జరిపి, భాగస్వామ్యంలో సాధించిన పురోగతిని సమీక్షించనున్నారు. సాంస్కృతిక, చారిత్రక నగరమైన యోగ్యకార్తాలో కూడా పర్యటించి.. అక్కడి ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శిస్తారు. జకార్తాలో, నరేంద్ర మోదీ ప్రవాస భారతీయుల భారీ సభను ఉద్దేశించి కూడా ప్రసంగిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ విద్యావేత్త, దార్శనికుడు, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకొని పలువురు ప్రముఖులు ఆయనకు ఈరోజు నివాళులు అర్పించారు. డాక్టర్ ముఖర్జీ ఒక విశిష్ట విద్యావేత్త, దూరదృష్టి గల రాజనీతిజ్ఞుడు, దేశ నిర్మాత అని.. భారతదేశ విద్యా, రాజకీయ, ప్రజాస్వామ్య ప్రస్థానంలో చెరగని ముద్ర వేశారని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశభక్తుడని, దేశానికి అంకితమైన దూరదృష్టి గల నాయకుడని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆధునిక భారతదేశానికి దిశానిర్దేశం చేయడంలో ఆయన ఆలోచనా విధానం కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

శ్యామా ప్రసాద్ ముఖర్జీ తన జీవితాన్ని దేశ ఐక్యతను పరిరక్షించడానికి, ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడానికి, జాతీయ సమైక్యత సాధనకు అంకితం చేశారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం పోస్టులో వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను (PACS) బలోపేతం చేసేందుకు కృషి జరుగుతోందని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా తెలిపారు. సహకార మంత్రిత్వ శాఖ 5వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ప్రాంతంలోనూ అత్యుత్తమ పనితీరు కనబరిచే 5 సహకార సంఘాలను గుర్తించేందుకు ర్యాంకింగ్ విధానాన్ని ప్రకటించినట్టు పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయ పంటల ఉత్పత్తిని పెంచాలని, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని రైతులకు పిలుపునిచ్చారు. గత 5 ఏళ్లుగా `సహకారం ద్వారా సమృద్ధి` అనే సూత్రాన్ని అనుసరిస్తూ.. లక్షలాది మంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన సహకార మంత్రిత్వ శాఖను ఆయన ప్రశంసించారు. ఈ రంగంతో అనుసంధానమైన 30 కోట్ల మంది ప్రజలకు, దేశవ్యాప్తంగా ఉన్న 8 లక్షల 50 వేలకు పైగా సహకార సంస్థలకు ఈరోజు ఎంతో శుభప్రదమైనదని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భవిష్యత్‌కు సిద్ధంగా ఉండే సమీకృత రవాణా వ్యవస్థను నిర్మించడంలో పరివర్తనాత్మక కార్యక్రమాల ప్రాముఖ్యత ఎంతైనా ఉందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి, దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్న మల్టీ-మోడల్ లాజిస్టిక్స్ పార్కులు, రోప్‌వేలు, ఇంటర్‌మోడల్ స్టేషన్ల పురోగతిని ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టులు మల్టీమోడల్ కనెక్టివిటీని బలోపేతం చేస్తూ.. కొత్త ఆర్థిక అవకాశాలను అందిస్తాయని, అలాగే సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు దేశీయంగా లాజిస్టిక్స్‌లో పోటీతత్వాన్ని పెంచుతాయని చెప్పారు. ప్రాజెక్టుల అమలును ప్రభావితం చేస్తున్న పలు కీలక సవాళ్లను సమీక్షించిన ఆయన.. సంబంధిత భాగస్వాములందరూ అడ్డంకులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించి, ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఈ ఏడాది ఒడిశాలోని పూరి జగన్నాథ రథయాత్ర కోసం 300కు పైగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం, రవాణా సేవలు సజావుగా అందించేందుకు రథయాత్రకు సంబంధించిన రైల్వే శాఖ

ఏర్పాట్లను సమీక్షించనున్నామని చెప్పారు. పూరీ రైల్వే స్టేషన్‌లో 30 వేల మంది ప్రయాణికులకు వసతి కల్పించేలా తాత్కాలిక ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే.. ఓనం పండుగ సందర్భంగా కూడా రైల్వే శాఖ 100కు పైగా ప్రత్యేక రైళ్లను నడపనుందని అశ్వినీ వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

బ్రిక్స్ మాదక ద్రవ్య నిరోధక సంస్థల అధిపతుల సమావేశం గౌహతిలో ఈరోజు ప్రారంభమైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. భారత ప్రతినిధి బృందానికి నేతృత్వం వహిస్తున్న నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో డైరెక్టర్ జనరల్ అనురాగ్ గార్గ్ ప్రారంభోత్సవ సమావేశంలో మాట్లాడుతూ... ఆధునిక మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లు సముద్ర మార్గాల ద్వారా సరిహద్దులు దాటి పని చేస్తున్నాయని, అందువల్ల మెరుగైన అంతర్జాతీయ సహకారం అత్యవసరమని ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (NEET) UG 2026 పరీక్షకు సంబంధించిన రీఫండ్ కోసం బ్యాంక్ ఖాతా వివరాలను అందజేసే గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) రేపటి వరకు పొడిగించింది. బ్యాంక్ ఖాతా వివరాలను ధృవీకరించిన అభ్యర్థులకు ఇప్పటికే రీఫండ్ ప్రక్రియ ప్రారంభమైందని NTA తెలిపింది. ఇప్పటివరకు కేవలం 8 లక్షల 29 వేల 510 మంది అభ్యర్థులు మాత్రమే తమ బ్యాంక్ వివరాలను అప్‌డేట్ చేయడం జరిగిందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

విశ్వవిద్యాలయాలు, కళాశాలల కోసం నిర్వహించిన 17వ జాతీయ యువ పార్లమెంట్ పోటీ (2024-25) బహుమతి ప్రదానోత్సవం న్యూఢిల్లీలో రేపు జరగనుంది. ఈ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విశ్వవిద్యాలయాలు, కళాశాలల విద్యార్థులకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బహుమతులను అందజేస్తారు. ఈ పోటీలో కాశ్మీర్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించారు. పార్లమెంటరీ విధానాలు, ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మంత్రిత్వ శాఖ గత 29 ఏళ్లుగా యువ పార్లమెంట్ పోటీలను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 51 విశ్వవిద్యాలయాలు, కళాశాలల భాగస్వామ్యంతో 17వ జాతీయ యువ పార్లమెంట్ పోటీ (2024-25) జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న 3 రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, గుజరాత్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. అలాగే రానున్న 2 రోజుల్లో తూర్పు రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, కేరళం, మాహే, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు గుజరాత్, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో భారీ నుండి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి రెడ్ అలర్ట్ జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =